
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 1 డిసెంబరు 2025 | 5



నేడు పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ నెలలో మొత్తం 2,34,520 మందికి రూ.102.704 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

దిత్వా గాలు!



చివరికిలా : గొల్లప్రోలులో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యపు రాశులు



మళ్లీ కష్టమే: దేవరపల్లిలో ధాన్యం బరకాలు

భయపెడుతోన్న మరో తుఫాన్

పాపం అన్నదాత.. పండించే వరకే పంట అన్నదాత చేతుల్లో ఉంటుంది.. పండించిన తరువాత ప్రకృతి చేతుల్లో ఉంటుంది.. ప్రకృతి కరుణిస్తే పంట చేతికొస్తోంది.. లేదంటే ప్రకృతిలో కలిసిపోతోంది.. ఆరుగాలం కష్టించిన అన్నదాతను నష్టాల పాలు చేస్తోంది.. మొన్న మొంథా తుఫాన్ కష్టం నుంచి అన్నదాత తేరుకోలేదు.. ఇంకనూ పడుతూ లేస్తూ ఉన్నాడు..చివరికి ఏదో ఒక విధంగా బయటపడదామనుకుంటుంటే మళ్లీ దిత్వా తుఫాన్ వచ్చిపడింది.. ఎటు నుంచి ఏ కష్టం వస్తుందోనని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.. ఉన్న పంటను కాపాడుకునే పనిలో పడ్డాడు.. పంటను విక్రయించేసిన వాళ్లు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంటుంటే కళ్లాలపై ఉన్న వాళ్లు మాత్రం ఏం జరుగుతుందోననే దిగాలులో ఉన్నారు.. ఆదివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో మరో ప్రమాదం నుంచి బయటపడేందుకు సన్నద్ధమవుతున్నారు. మరో వైపు సముద్రంలోనూ ఈదురుగాలులు వీస్తున్నాయి.. దీంతో ప్రజల్లో అలజడి నెలకొంది..



ధాన్యం ఎత్తేయండి : గోపాలపురంలో ఇలా

(పిఠాపురం/గొల్లప్రోలు/పి.గన్నవరం/రాజమహేంద్రవరం/సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

పంట చేతికందే వేళ వరుస తుఫాన్ హెచ్చరికలు, మారుతున్న వాతావరణం రైతులను కలవరానికి గురిచేస్తోంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, మబ్బులతో కూడిన వాతావరణం, సాయంత్రం చిరుజల్లులతో రైతులు తమ ధాన్యాన్ని మిల్లులు చేర్చే వరకు భయంభయంగా ఆకాశం వైపు చూస్తూ కాలం గడిపారు. ధాన్యం తడవకుండా చూసుకునేందుకు రైతులు పాట్లు పడ్డారు. ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరాయి.

- తీవ్ర ఆందోళనలో రైతాంగం
- 50 శాతమే ఒబ్బిడి అయిన పంట
- కళ్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం
- పంట కాపాడుకునేందుకు పరుగులు

పెరిగిన చలి తీవ్రత

తుఫాన్ ప్రభావమో ఏమిటో కానీ ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి.. భానుడు మబ్బుల మాటున దాక్కునే ఉన్నాయి. ఉదయం నుంచి జనం తట్టుకోలేనంతగా చలి తీవ్రత ఉంది. రాత్రయినా వాతావరణంలో మార్పుకానరాలేదు. పెద్దలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మంకీ క్యాప్‌లు, స్వెటర్లు వేసుకుని తిరిగారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మారిన వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావం తో ఆదివారం వాతావరణం మారిపోయింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. పగటిపూటే చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాతానికి పైగా విస్తీర్ణంలో వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. మిగిలిన పంట పొలాల్లోనే ఉంది. కోతలు, నూర్పుళ్లు వేగంగా జరుగుతున్న తరుణంలో దిత్వా తుఫాన్ హెచ్చరికతో ఆదివారం రైతులు వ్యవసాయ పనులు నిలిపివేశారు. ధాన్యం తడవకుండా పరుగులు పెట్టారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుని బరకాలు,టార్పాలిన్లు కప్పారు. వరి కుప్పల్లోకి నీరు చేరకుండా బరకాలు కప్పారు. మరో వైపు మిల్లుల వద్ద ఉన్న లారీలు, ట్రాక్టర్లల్లో ధాన్యం బస్తాలు తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో వైపు గాలుల ప్రభావంతో వరి పంట నేలవాలింది.రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన పంట నేలనంటడంతో గింజ రాలే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాబజార్..

వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యంలో ఎక్కువ శాతాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారు. దళారులు, వ్యాపారుల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. తేమ శాతం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇప్పుడు తుఫాన్‌తో వాతావరణం మారడంతో ఇదే అదనుగా ధాన్యాన్ని తక్కువ కొనేందుకు ప్రయత్నిస్తున్నారు.రెండు రోజుల వ్యవధిలో ధాన్యం బస్తాను రూ.75 నుంచి రూ.125 వరకూ తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన ధరకు అమ్మకుంటే ధాన్యం వర్షానికి తడిస్తే నష్టం మరింత అధికంగా ఉంటుందని భావించి వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు.

మొంథా మరువక ముందే...

ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వరిచేలు నేలనంటాయి. దిగుబడి గణనీయంగా తగ్గి నష్టం వాటిల్లింది. ప్రస్తుత తుఫాన్ ప్రభావం మాసూలు చేసుకుంటున్న రైతులపై పడింది. ఎక్కువశాతం రైతులు యాంత్రీకరణ ద్వారానే తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నప్పటికీ వాతావరణం కరుణించకపోతే యంత్రాలు తిరిగే పరిస్థితి ఉండదు. ఒబ్బిడి చేసుకున్న ధాన్యం కనీసం ఒక్కరోజైనా ఎండబెట్టకపోతే తేమశాతం మిల్లర్లు సూచించిన స్థాయికి రాదు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు, మాసూళ్లు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వేచి చూడాలంటున్నారు. ధాన్యం రాశులు తడవకుండా, కుప్పల్లోకి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



సముద్రంలో ఎగసి పడుతున్న కెరటాలు

తీరాన అలజడి

కొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రం నీటిమట్టం పెరగడంతోపాటు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిప డుతూ ఉప్పాడ శివారు కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన బండరాళ్లను తాకుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచీ తీరంలో ఈదురు గాలులు వీచడంతో సముద్రంలోకి వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకొన్నారు.

తూర్పున ఇలా..

ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో సాగు చేయగా 62,712 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోతలు ఆపేశారు. కళ్లాల్లో సుమారు 30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యం కాగా ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించింది.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 1,67,406 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1,08,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఈస్ట్రన్ డెల్టాలో ముందుగా కోతలు మొదలైనప్పటికీ మొంథా తుఫాన్ ప్రభావంతో స్వర్ణ రకం ఎక్కువ శాతం నేలనంటడంతో పాటు కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.ఈస్ట్రన్ డెల్టాలో ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో, సెంట్రల్ డెల్టాలో 28 వేల ఎకరాల వరకు కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

కాకినాడలో ఇలా..

కాకినాడ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన తాళ్లరేవు, కరప, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం, కోట నందూరు, ఏలేశ్వరం మండలాల్లో మాత్రమే కోతలు ఇంకా మిగిలి ఉన్నాయి. 40 వేల మంది రైతుల సెల్‌ఫోన్లకు వాతావరణ సమాచారాన్ని అందించి జాగ్రత్తలను వివరించాం. డెల్టా ప్రాంత మండలాల్లో 75 శాతం పంటకోతలు పూర్తయ్యాయి. పంట కోతలను ప్రస్తుతానికి ఆపి వేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశించారు.

ఇక నుంచి రేషన్ దుకాణాల్లో

టీ పొడి విక్రయాలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రేషన్ దుకాణాల్లో టీ పొడి విక్రయించనున్నారు. తొలుత కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో టీ పొడి విక్రయించాలని నిర్ణయించారు. 20 గ్రాముల ప్యాకెట్ రూ.10, 40 గ్రాముల ప్యాకెట్ రూ.20కు అమ్మకాలు చేసే విధంగా ధరలు నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 472 రేషన్ దుకాణాల్లో తొలుత టీ పొడిని విక్రయించనున్నారు. రేషన్ డీలర్లకు బియ్యం, పంచదార విక్రయిస్తే వచ్చే కమీషన్‌తో పాటు ఇక నుంచి టీ పొడి అమ్మకాల ద్వారా కూడా 14 శాతం మార్జిన్ వస్తోంది. టీ పొడి విక్రయించే రేషన్ డీలర్లు రూ.5వేలు చొప్పున డీడీలు తీయాలని అధికారులు సూచించారు.అయితే రేషన్ డీలర్లు మాత్రం తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని టీ పొడిని అరువుపై ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులను కోరుతున్నారు.టీ పొడి విక్రయించిన తర్వాత సొమ్ములు ప్రభుత్వానికి జమ చేస్తామంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రేషన్ దుకాణాలను మినీ మాల్స్‌గా తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రేషన్‌కార్డుదారులు సూపర్ మార్కెట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ ఇక్కడే లభించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

5 నుంచి నన్నయలో అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 5,6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆయోకీం పబ్లిషర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు పరిశోధనా పత్రాలను 2వ తేదీ లోపు సమర్పించవచ్చన్నారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు, వ్యవసాయ ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. దేశ విదేశాల నుంచి శాస్త్ర సాంకేతిక రంగంలో నిష్ణాతులు వక్తలుగా హాజరవుతారన్నారు. వివరాలకు సదస్సు కన్వీనర్ బి.జగన్మోహన్‌రెడ్డి 93471 53270 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురజాడకు ఘన నివాళి

అనపర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషను వ్యవహారిక భాషగా చేసేందుకు భాషోద్యమం చేసిన గురజాడ అప్పారావు చిరస్మరణీయుడని కేంద్ర ఉక్కు.భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్య క్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ గురజాడ రచించిన దేశమంటే మట్టికాదోయ్ అన్న పద్యాన్ని పాడి మన మనసులను పులకరింపజేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ,రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి

సుబ్బారాయుడి కల్యాణం

కోరుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. 560 మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి బాల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో శైవ ఆగమ పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.





కామన్వెల్త్ విజేతగా విద్యార్థిని జూహిత గుణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ లాలాచెరువు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జూహిత గుణ ఈటానగర్‌లో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ మేరకు హెచ్ఎం యు.విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో 69 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని జూహిత గుణ సాధించిందని తెలిపారు. నవంబరు 26 నుంచి ప్రారంభమైన పోటీలు డిసెంబరు ఒకటో తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్ ఈటానగర్‌లో జరుగుతున్నాయన్నారు. తమ పాఠశాల విద్యార్థి జూహిత స్వర్ణపతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. అర్బన్ డిఐ దిలీప్ కుమార్, ఆనందనగర్ స్కూల్ హెచ్ఎం అంకం మల్లేశ్వరరావు ,ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బీజేపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఐదు అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా పాలడుగల శ్రీవిద్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పేపకాయల కాశీ, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తగరం సురేష్‌బాబు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్ జైన్‌లను నియమించారు.

చెరువులు వదలరు!



ఖాళీగా కనిపిస్తే కబ్జా

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :ఎక్కడికక్కడ చెరువులు మాయమైపోతున్నాయి..ఖాళీగా కనిపిస్తే కబ్జా అయిపోతున్నాయి.. రాత్రి రాత్రే స్థలాలుగా మారి పోతున్నాయి. ఇక్కడ గతంలో చెరువు ఉండేదిగా ఏమైపోయిందనే మీ మాంసలో ప్రజలు మునిగితేలుతున్నారు. చెరువులు అన్యా క్రాంతం కాకుండా చూడాల్సిన నీటి పారుదల, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులదే. అన్నీ తెలి సిన అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ అయినా కాడికి జేబులో వేసుకుని కళ్లు మూసుకుంటున్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలా లను అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారు. దాతల ఆశయా లను నీరుగారుస్తున్నారు. చెరువు గర్భంలో గాని, చెరువు గట్లను ఆనుకొని గాని ఎటువంటి కట్టడాలు నిర్మాణాలు చేయకూడదన్నది నిబంధన. ఇక్కడ ఏకంగా చెరువులు,కాలువ గట్లు కబ్జా చేసి లే అవుట్లు వేస్తున్నారు..నిర్మాణాలు చేస్తున్నారు.

- ఆక్రమించేస్తున్న రియల్టర్లు
- చెరువులు.. కాలువ గట్లు మాయం
- యథేచ్ఛగా సాగుతున్న విక్రయాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- జిల్లా కేంద్రంలోనూ మోసాలు

సామాన్యులు బలి

రూపాయి, రూపాయి పోగేసుకొని చౌకగా వస్తుందని కష్టపడి కొనుక్కొంటున్న మధ్య తరగతి ప్రజలు, చిరుద్యోగులు రియల్టర్ల మాటలు నమ్మి మోసపోతున్నారు. కోలమూరు పంచాయతీ పరిధిలోని మర్ల చెరువుకు అనుకొని 316/1)లో వేసిన లేఅవుట్‌లో చిరు ప్రభుత్వ ఉద్యోగి సుమారు 125 గజాలు స్థలం కొనుగోలు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణానికి లోనుకు వెళ్లగా బ్యాంకు అధికారులు ఎన్‌వోసీ తీసుకురమ్మని చెప్పడంతో రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయ అధికారులను సంప్రదించాడు. అప్పుడు తేలింది అసలు విషయం తాను కొనుక్కొన్న స్థలంలో సుమారు సుమారు 40 గజాలు మర్ల చెరువు (సర్వే నెంబరు 313)కి సంబంధించిందని..ఇవి ఉదాహరణలు మాత్రమే ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘటనలు బోలెడు.. అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

అందుగలదు.. ఇందులేదని..

రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు, వెంకటనగరం, కొంతమూరు, కోలమూరు, రాయుడుపాకలు, గాడాల, ధవళేశ్వరం, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో చెరువులు, ఇరిగేషన్ స్థలాలను కబ్జా చేసి మరీ లేఅవుట్లు వేసి విక్రయాలు చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారుల మామూళ్ల మత్తులో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. చెరువుగట్లు, పంట కాలువలు ఉన్న ప్రాంతాల్లో లేఅవుట్ వేయాలంటే ఇరిగేషన్ , రెవెన్యూ శాఖల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ తీసుకోవాలి. అయితే అక్రమార్కులకు అటువంటి ధ్రువీకరణలు లేకుండానే ఓకే చెప్పేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో వారికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు, రుడా అధికారులు కళ్లు మూ సుకుని వాటికి సంబంధించి ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేస్తున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారో..

రాజమ హేంద్ర వరం రూరల్ మండలం వెంకటనగరం పం చాయతీ పరిధిలో గల కాతేరు గ్రామాన్ని ఆనుకుని ఉన్న లేఅవుట్ లో సుమారు 28 అడుగుల మేర చెరువు గట్టు కలిపి రోడ్డుగా చూపించారు. అదే విషయాన్ని రెవెన్యూ అధికా రులు నిర్ధారించారు.ఈ లేఅవుట్‌కి సంబంధించి ఇరిగేషన్ అధికారులు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని ఇరిగేషన్ ఏఈ చెబుతున్నారు.రుడా అధికా రులు అనుమతులు ఇచ్చారంటూ అమ్మకాలు సాగిస్తు న్నారు. పంచాయతీ అధికారులు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేస్తున్నారు.





మృతుడు ఆనంద్(ఫైల్), సంఘటనా స్థలంలో లభించిన కత్తి

మాటువేసి..చంపేశాడు

- దోసకాయలపల్లిలో దారుణం
- బావను హత్య చేసిన బావమరిది
- ఇంట్లో నుంచి గెంటేశాడని కోపం


కోరుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉండే గ్రామంలో దారుణహత్య కలకలం రేపింది. హత్య విషయం తెలిసి అంతా ఉలిక్కిపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కోరుకొండ మండలం దోసకాయపల్లి గ్రామానికి చెందిన పిల్లి ఆనంద్ (27) మాంసం వ్యాపారం చేసుకుంటూ భార్య త్రివేణితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో త్రివేణి పెద్దమ్మ కొడుకు సీతానగరం మండలం ములకల్లంక గ్రామానికి చెందిన గాది రాజ్‌కుమార్ సహాయకుడిగా ఉంటూ వాళ్లింట్లోనే ఉండేవాడు. ఆ సమయంలో ఆనంద్ భార్య త్రివేణి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అతన్ని మందలించి ఇంటి నుంచి పంపించివేశారు. ఇదిలా ఉండగా రాజ్‌కుమార్ త్రివేణికి ఫోన్‌చేసి అసభ్యంగా మాట్లాడడం, ఆమె భర్తను చంపుతానని బెదిరించి ఫోన్ పెట్టేసేవాడు. ఏదో రోజు నీ భర్తను చంపుతానని త్రివేణిని బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆనంద్ రైతు సేవా కేంద్రం వెనక వైపు మేకలు కోసేందుకు వెళ్లాడు.అయితే అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న గాది రాజ్‌కుమార్ కత్తితో నరికి చంపి కత్తి అక్కడే పడేసి బైక్‌పై పరారైనట్టు పోలీసుల తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగార్జున తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనతో దోసకాయపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. హత్యకు గురైన ఆనంద్‌కు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.భర్త మృతదేహాన్ని పట్టుకుని ఇక మాకు దిక్కెవరంటూ భార్య రోదిస్తుంటే ఆపడం ఎవరి వల్లా కాలేదు. రాజ్‌కుమార్‌ను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమవుతున్న భార్య త్రివేణి, బంధువులు

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15 కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి ఆదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్టును గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎం డబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంత్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు..... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్ట్యూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర ఆంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ల ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీబీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా ఆరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆధారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆధారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ ఆఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3


అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



దుల్కర్ కొత్త సినిమా

మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పొలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

అఖండ నుంచి అవతార్ వరకూ...







ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్

'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్ధార్థ్' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ', హాలీవుడ్ మూవీ 'అనకొండ', గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్' చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం



హర్షాలి మల్హోత్రా

'**బా**లకృష్ణ గారి లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాడల్లో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.


బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్‌ఎక్స్ ప్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?



అదూర్ గోపాలకృష్ణన్

ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచనలాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ



తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.

ఉల్లాసం... ఉత్సాహం!

రాజమహేంద్రవరంలో ముగిసిన గోదావరి బాలోత్సవం

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన దృశ్యాలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో 2రోజులపాటు జరిగిన గోదావరి బాలోత్సవం ఆదివారంతో ముగిసింది. చిన్నారులు క్లాసికల్ డ్యాన్సు, సైన్సు ప్రయోగాలు, గణిత పజిల్స్, జానపద నృత్యాలు, కోలాటం, లఘునాటికలు, జానపద గీతాలాపన, చిత్రలేఖనం తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతుల ప్రదానోత్సవంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఏ.విశ్వేశ్వరరావు, ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, అపుస్మా జిల్లా కార్యదర్శి పి.కల్యాణ్‌రెడ్డి, ప్రముఖ చిత్రకారుడు దామెర్ల రామారావు మనవడు డెన్నిస్ దామెర్ల, ఎస్‌టీఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి టి.క్రాంతికుమార్, గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తులసి, ప్రధాన కార్యదర్శి డి.సాయిబాబా, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

శుభ ముహూర్తం ఖరారు...

జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2 వరకు అంతర్వేదిలో వార్షిక కల్యాణోత్సవాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక దివ్య, తిరు కల్యాణ మహోత్సవాలకు శుభ ముహూర్తం ఖరారైంది. తొలుత అర్చకులు, స్థానాచార్యులు, వేదపండితులు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్‌కు ముహూర్తపు పత్రికను ఆదివారం అందించారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ముహూర్త నిర్ణయం ప్రకారం.. 28న రథ సప్తమి పర్వదినం రోజున మొదలుకుని రాత్రి 1.56 గంటలకు స్వామివారి కల్యాణం, 29న గురువారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామివారి రథోత్సవం, 1న ఆదివారం ఉదయం 8గంటలకు స్వామివారి చక్రస్నానం (సముద్రస్నానం), 2న సాయంత్రం 6 గంటలకు స్వామివారి తెప్పోత్సవం జరుగుతాయి. మాఘమాసంలో జరిగే స్వామివారి కల్యాణోత్సవాల్లో 9రోజులు స్వామివారు ఒక్కో వాహనంపై గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం (వాహనసేవ) జరుగుతుంది. స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లలో భాగంగా వివిధ శాఖల అధికారులతో అమలాపురం ఆర్డీవో కె.మాధవి అధ్యక్షతన డిసెంబరు 4న ఉదయం 11 గంటలకు సమీక్షా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ పేర్కొన్నారు.

అజాత శత్రువు వాజపేయి

ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన మహోన్నతుడు: కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

వాజపేయికి మండపేటతో విడదీయని బంధం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఏపీలోనే తొలిసారిగా మండపేటలో వాజపేయి విగ్రహం ఏర్పాటు



సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, హాజరైన ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు



వాజపేయి విగ్రహానికి పూలదండ వేస్తున్న ఎంపీ పురందేశ్వరి, మాధవ్

మండపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధానిగా పనిచేసిన దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి రాజకీయాల్లో అజాత శత్రువని, ప్రధానిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఆదివారం వాజపేయి విగ్రహాన్ని రాజమహేంద్రవరం ఎంపీతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని తాపేశ్వరం వేడుక ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కూటమి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ దేశప్రధానిగా స్వర్ణభూజ్ పథకం గ్రామాల్లో రహదారుల నిర్మాణం, విద్య, వైద్య టెలికాంరంగాలకు వాజపేయి ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. దేశ సమగ్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విమానయానం ప్రపంచ దేశాలతోపాటు అణుబాంబు తయారీ చేయడం వంటి విషయాల్లో సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న ధైర్యశాలీ వాజపేయి అని మాధవ్ అన్నారు. వాజపేయికి మండపేటతో విడదీయరానీ బంధం ఉందన్నారు. మండపేటకు 1983లో వాజపేయి వచ్చినపుడు బీజేపీ సీనియర్ నాయకుడు వల్లూరి పార్థసారది ఇంట ఆతిథ్యం స్వీకరించిన విషయాన్ని మాధవ్ గుర్తుచేశారు. మండపేటలో బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన వాజపేయి విగ్రహం రాష్ట్రంలోనే తొలి విగ్రహమని, ఇక్కడ బీజేపీ శ్రేణుల స్ఫూర్తితో రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వాజపేయి శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. సభలో మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, యాళ్ల దొరబాబు, సుబ్బారావు, కర్రి చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

కుంభమేళాను తలపించేలా గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు

రూ.1000కోట్లు ఖర్చు అంచనా.. ఇప్పటికే రూ.100కోట్ల నిధుల విడుదల

రామవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవ్, పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 2027 గోదావరి పుష్కరాలను కుంభమేళాను తలపించే విధంగా నిర్వహించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రప్రభుత్వం సహకరిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుష్కరాలకు రూ.1000కోట్లు ఖర్చు అంచనా వేయడం జరిగిందని, ఇప్పటికే రూ.100కోట్ల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పుష్కరాల సందర్భంగా చేపట్టే పనులు పూర్తిస్థాయిలో పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టడం చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పుష్కరాల పనుల ప్రణాళిక కోసం కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పర్యటించడం జరిగిందన్నారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీజేపీ యంత్రాంగానికి తగిన సూచనలు, శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్యే నల్లమిల్లి పాల్గొన్నారు.

మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు

అమలాపురం వేదిక

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో నిర్వహణ
- పోస్టర్ ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు
- పాల్గొన్న కిమ్స్ చైర్మన్ చైతన్యరాజు, ప్రభుత్వ విప్ దాట్ల, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరించిన చైతన్యరాజు, ప్రభుత్వ విప్ సుబ్బరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అమలాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణం వేదిక కానుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 మార్చి 1వ తేదీన కిమ్స్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఆ సంస్థ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరగనున్న తెలుగు మహాసభలకు సంబంధించి ఆదివారం కిమ్స్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ ఆర్భాటంగా జరిగింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28, మార్చి 1వ తేదీన జరిగే ఈ మహాసభలను ప్రతీ ఒక్కరు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఘనంగా విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. చైతన్య విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాకే గర్వ కారణంగా నిలిచే రీతిలో ప్రపంచానికి తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలియచేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కలసికట్టుగా పనిచేస్తాం...

అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ మహాసభలను తాము బాధ్యతగా తీసుకుని 2రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు తామంతా కలసికట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఇక్కడకు సమీపంలోని ఆంధ్ర, గోవా, కోకో బీచ్‌లో ఏర్పాట్లను చేస్తున్నట్టు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రెస్టారెంటు, వాటర్ స్పోర్ట్స్, బీచ్ వాలీబాల్, ఇలా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేకునేలా బీచ్‌లో ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సభలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబుతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ పి.విజయలక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, జనసేన నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు, కిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ పి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ మోహనరాజు, ఎన్టీయూ నాయకులు దొరబాబు, పినిపే సత్యనారాయణ, బండారు రామ్మోహనరావు, ఎస్వీ నాయుడు మాట్లాడారు. రాజమహేంద్రవరం వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలు 2 పర్యాయాలు నిర్వహించారని, మూడో పర్యాయం అమలాపురంలో నిర్వహించడానికి నిర్ణయించామని చైతన్యరాజు ప్రకటించడంతో పాటు సభల్లో విద్యార్థులకు తెలుగు భాషా ప్రావీణ్యంలో పలుఅంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం ద్వారా భాషాభిమానాన్ని పెంపొందించడానికి కీలకంగా ఉపయోగపడుతుందని నిర్వాహకులుపేర్కొన్నారు.

10వేల మందితో శోభాయాత్ర..

సభకు అధ్యక్షత వహించిన కేవీవీ చైర్మన్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ 2 రోజుల పాటు జరిగే ప్రపంచ తెలుగు మహాసభలను జిల్లా ఖ్యాతిని ప్రపంచదేశాల్లో ఇనుమడింపచేసేలా అమలాపురంలో నిర్వహిస్తామని తెలిపారు. 10వేల మందితో ఫిబ్రవరి 28న శోభాయాత్ర పట్టణంలో నిర్వహిస్తామన్నారు. వెయ్యి మందికి పైగా కవులతో సమ్మేళనం, వివిధ రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎం లతో సహాయ తెలుగుభాష కోసం పనిచేస్తున్న ప్రపంచంలో పేరెన్నిగన్న వ్యక్తులందరినీ ఈ వేదికపైకి పిలిచి సత్కరించనున్నట్టు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి...

బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తరలివచ్చిన ఉపాధ్యాయులు.. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సెల్ఫీలు తీసుకుంటూ కబుర్లు చెపుకుంటున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాల్గొన్న వీసీ, ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. విశ్వవిద్యాలయంలో తొలిసారి తొలి సమావేశంగా జరిగిన ఈ సమ్మేళానికి పూర్వ విద్యార్థులు అనేకమంది వచ్చారు. వారిలో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. వారంతా క్లాస్ రూమ్స్‌కి వెళ్లి అలనాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని, ఇక్కడకు విశ్వ విద్యాలయం రావడంతో తెలుగు భాషా అభిమానిగా తన పాత్ర కూడా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు కూడా ఈ విశ్వ విద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి సమ్మేళనాల వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని, ఇంత మంది ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేకత చెప్పడంతో మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. వీసీ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో ఉన్న శాఖలన్నీ దశలవారీగా ప్రవేశపెట్టి, వచ్చే ఏడాది నుంచి విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టామని, కోర్సుల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చామని, చాలా కోర్సులకు మంచి స్పందన ఉందని చెప్పారు. పూర్వ పీఠాధిపతి బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తరచు కలుసుకుంటూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వీసీ నాయుడికి విశ్వవిద్యాలయంపై పూర్తి అవగాహన ఉందని, ఆయనకు అందరూ సహకరిస్తే బాగా అభివృద్ధి చేయగలరన్నారు. ప్రముఖులు రెంటాల వేంకటేశ్వర్లు, కూర్మయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ బిడ్డ అదరగొట్టింది..

'బాల సాహిత్య బేరీ'లో పాల్గొన్న గురుత్వ సమందా సింగ్



సమందా సింగ్

చింతూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ బిడ్డ మడివి గురుత్వ సమందా సింగ్ ప్రపంచ సాహిత్య వేదిక ప్రశంసలు అందుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం గూడూరుకు చెందిన మడివి నెహ్రూ దంపతుల పెద్ద కుమార్తె గురుత్వ సమందా సింగ్ భద్రాచలం యజ్ఞజా పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. కాగా తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వర్చువల్ పద్ధతిన బాల సాహిత్య బేరీ పేరిట అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహించింది. ఇందులో పాల్గొనే అవకాశం గురుత్వ సమందా సింగ్‌కు కలిగింది. కార్యక్రమం దాదాపు 13 గంటల పాటు సాగింది. ప్రపంచవ్యాప్తంగా 101మంది తెలుగు విద్యార్థులు పాల్గొన్నారు. కథ, వచన కవిత్వం, గేయం, పద్య విభాగాల్లో ప్రతిభ చాటారు. గురుత్వ సమందా సింగ్ కథ విభాగంలో ఆదివాసీ సంప్రదాయ వేషధారణలో పాల్గొంది. దేశవ్యాప్తంగా ఆదివాసీలు చేసుకునే పేన్ పండూం (ఇలవేల్పులు, పితృదేవుళ్లు) ఇతివృత్తాన్ని కేవలం 3 నిమిషాల్లో వివరించింది. పలు విశ్వ విద్యాలయాల వీసీలు, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు, ప్రఖ్యాత బాలసాహిత్యవేత్తలు గురుత్వ సమందా సింగ్‌పై ప్రశంసలు కురిపించారు. పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ ఉషారాణి విద్యార్థినిని అభినందించారు.

హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం

భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హేతువాద దృక్పథంతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి నేదూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మతాలు, కులాలు, జాతులు, వర్గాల నుంచి మనుషులు స్వేచ్ఛా జీవులు కావాలన్నారు. ఆధునిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ మూఢ విశ్వాసాల్లో ఎందరో కూరుకుపోతున్నారని విమర్శించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ మహాసభలు ఆదివారం అమలాపురం ఎస్టీయూ జిల్లా శాఖ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా సత్యనారాయణ మాట్లాడుతూ హేతుబద్ధ ఆలోచనలతో ప్రతీ వ్యక్తి పాశవిక నిర్ణయాలు తీసుకుని యథార్థాన్ని గ్రహించాలన్నారు. విశ్వ అవగాహనతో జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం, విశ్వ పరిణామం-జీవపరిణామం నిత్య జీవితంలో హేతువాదం అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు. నేదూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం గ్రంథాన్ని జనిపెల్ల భీమారావు ఆవిష్కరించి ద్వంద్వ సమీక్ష చేశారు. ఉమ్మడి జిల్లా హేతువాద సంఘ అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా డి.రాజశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ దరియావలీ, రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ, డి.ప్రకాష్‌లు వివిధ అంశాలపై మాట్లాడారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తుండగా..

వ్యాన్ బోల్తా

ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



ప్రమాద స్థలంలో వ్యాన్, క్షతగాత్రులు





దేవీపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా వ్యాన్ బోల్తా పడి ఒకరి మృతిచెందగా ఐదుగురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలువురు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గండి పోశమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకునేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. సాయంత్రం వరకు ఉండి బయలుదేరారు. మధ్యంమత్తులో డ్రైవర్ వ్యాన్‌ను నడపడంతో దేవీపట్నం మండలం అంగులూరు గ్రామ శివారుకు వచ్చేసరికి అదుపుతప్పి రహదారి పక్కన లోయలోకి వ్యాన్ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో యలమంచిలి మండలానికి చెందిన కంద్రేకుల నరసింహస్వామి (39) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురికి గాయాలు కావడంతో సీతానగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రంపచోడవరం సీఐ సన్యాసినాయుడు, దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ ప్రమాదస్థలికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దర్శనాలు ఆపినా ఆగని భక్తులు...

గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరుకోవడంతో గత కొన్ని నెలలుగా అమ్మవారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే అంగుళూరు మెట్టపైన అమ్మవారి విగ్రహం ఉండడంతో పోశమ్మ గండి వచ్చిన భక్తులు ఇక్కడే దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అంగుళూరులో బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు జరపడంతో వచ్చిన భక్తుల్లో పలువురు మద్యం తాగి ఇలా ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇప్పటికైనా బెల్టు షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జిమ్నాస్టిక్స్ ఓవరాల్ చాంపియన్

'తూర్పు గోదావరి'



బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీలు పద్మశ్రీ, గోపిమూర్తి

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌గా తూర్పు గోదావరి జిల్లా, రెండో స్థానంలో గుంటూరు జిల్లా, మూడో స్థానంలో విశాఖపట్నం జిల్లా నిలిచాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీలు బొర్రా గోపిమూర్తి, కర్రి పద్మశ్రీ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ పి.రవిచంద్ర, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుధారాణి, సెక్రటరీ పి.శ్రీనివాస్, మాజీ సెక్రటరీ ఎల్.జార్జ్, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు నష్టం

ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి రాంబాబు



నూతనంగా ఎన్నికైన బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యవర్గం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఉదయకుమార్, అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిరావు, ఇతర నాయకులు మాట్లాడారు. అనంతరం నూతన ప్రాంతీయ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ప్రాంతీయ కార్యదర్శిగా యాళ్ల మురళీధర్, ఉప కార్యదర్శులుగా కిషోర్, స్వాతి, కోశాధికారిగా వెంకటేశ్వరరావు సహా పలువురిని ఎన్నుకున్నట్టు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిరావు తెలిపారు.

నేడు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా డిసెంబరు 1వ తేదీన జిల్లాలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర తెలిపారు. హెచ్ఐవీ పరీక్ష చేయించుకోండి-సమాచారం పొందండి-సురక్షితంగా ఉండండి అనే నినాదంతో ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వరకూ ర్యాలీ, అనంతరం కళాశాల సెమినార్ హాలులో అవగాహన సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సినీ గేయ రచయిత సిరివెన్నెలకు నివాళి



సిరివెన్నెల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రౌన్ మందిరంలో ఆదివారం సినీ గేయరచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి 4వ వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి కవి సన్నిధానం నరసింహశర్మ అంజలి ఘటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ సాహిత్యంలో ఆధునిక శకం సిరివెన్నెలతోనే ప్రారంభమైందన్నారు. పాండిత్య పునాదులపై విరిసిన పాటల భవనం నిర్మించిన కవి సిరివెన్నెలని ఆయన స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన యాగంటి కోటి హనుమంతరావు మాట్లాడుతూ పాండిత్యం మూలాలు తెలిసి, భాషా సాహిత్యంపై సాధికారత కలిగిన సినీ రచయిత సిరివెన్నెలని అన్నారు. ఆయన సాహిత్యంలో దేవులపల్లి కవిత్వ స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుందని సన్నిధానం శాస్త్రి అన్నారు.ఈ సందర్భంగా గరికిపాటి సత్యస్వరూప్ సిరివెన్నెల పాటలు పాడారు. కార్యక్రమంలో గాడేపల్లి భవాని, వింజమూరి లావణ్య, జి.భార్గవి, వి.సౌందర్య వల్లి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం వార్షిక మహాసభ



సభలో ప్రసంగిస్తున్న జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి డివిజన్ ఉద్యోగుల సంఘం 28వ వార్షిక మహాసభ ఆదివారం పాలకొల్లులో జరిగింది. ముఖ్య అతిథిగా జోనల్ ప్రధాన కార్యదర్శి టీవీఎన్ఎల్ రవీంద్రనాథ్ విచ్చేసి మాట్లాడారు. పాలసీదారులు ఆకాంక్షలకు అనుగుణంగా చేస్తున్న సేవలను మరింత మెరుగుపరచుకోవాలని, ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించుకోవాలని చెప్పారు. నూతన కార్యవర్గానికి అధ్యక్షుడిగా ఎస్ఆర్‌జే మాథ్యూస్,సెక్రటరీగా ఎం.కోదండరామ్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు సతీష్, ఉభయ గోదావరి జిల్లాల నుంచి సుమారు 300 మంది ఎల్ఐసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బావాజీపేటను ప్రత్యేక పంచాయతీ చేయాలి



ఎమ్మెల్యే నెహ్రూకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

గోకవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక పంచాయతీ పరిధిలో ఉన్న బావాజీపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వెదురుపాక, బావాజీపేట అఖిలపక్ష నాయకులు కోరారు.ఈ మేరకు వారు ఆదివారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి జిల్లా పంచాయతీ అధికారులతో మాట్లాడారు. ఈ విషయంపై అధికారుల నుంచి సానుకూల సమాధానం రావడంతో గ్రామసభ ఏర్పాటుచేసి తీర్మానం ఇస్తే తర్వాత ప్రక్రియను పూర్తి చేయవచ్చని ఎమ్మెల్యే చెప్పడంతో అఖిలపక్షం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పిల్లా చంటిబాబు, అఖిలపక్ష నాయకులు బత్తుల సారంగధరుడు, బొట్టా రామకృష్ణ, కొత్తల వీరఅప్పారావు, గొర్రెల శ్రీను, కోరిపల్లి అప్పలస్వామి, గొంతెన అప్పలస్వామి, దాసరి నాగవిష్ణు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

ముగిసిన షష్ఠి వేడుకలు



భక్తులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసు

దివాన్‌చెరువు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త నందూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆహార పదార్థాలను వడ్డించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, ప్రముఖ ఆడిటర్ విశ్వనాథం భాస్కరరామ్, వైద్యులు తులసీమోహనరావు, వ్యాపారవేత్త చలుమూరు శ్రీనివాస్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పట్టిసీమ శివక్షేత్రంలో కస్టమ్స్,జీఎస్టీ కమిషనర్ శ్రీధర్ పూజలు



పట్టిసీమ శివాలయంలో వీరేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కస్టమ్స్ కమిషనర్ శ్రీధర్

పోలవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పట్టిసీమ శివక్షేత్రాన్ని కస్టమ్స్ అండ్ జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్ ఆదివారం సందర్శించారు. విశాఖపట్టణం నుంచి రాజమహేంద్రవరం డివిజన్ కార్యాలయాల తనిఖీలకు వచ్చిన ఆయన పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయనతోపాటు విచ్చేసిన రాజమండ్రి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ పరమేశ్వర రావులను ఆలయ సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ దక్షిణకాశీగా పేరుగాంచిన పట్టిసీమ శివక్షేత్రాన్ని గతంలో కంటే సకల సౌకర్యాలతో తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు.

అలరించిన సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక దానవాయిపేట శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద సంగీత లహరి కళావేదికలో ఆదివారం సాయంత్రం సంగీత విభావరి జరిగింది. సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్.రామ్‌చరణ్, పి.జ్ఞానదేవ్, కె.యోగేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



లింగంపేట వాంబేకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక లింగంపేట వాంబేకాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాంబే గృహాల్లో గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి మోటార్ సక్రమంగా పనిచేయకపోవడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అంచనాలు తయారు చేసి నూతనంగా మోటారు ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అలాగే కాలనీలోని పలు బ్లాకుల్లో సెప్టిక్ ట్యాంకుల సమస్యకు, డ్రైనేజీల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. లింగంపేట 1వ వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనేక మంది పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డు తదితర సమస్యలు చెబుతున్నారని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి యాళ్ల ప్రదీప్, నగరపాలక సంస్థ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లంతా సంఘటితం కావాలి

- రైస్ మిల్లర్ల అసోసియేషన్ సమావేశంలో రాష్ట్రాధ్యక్షుడు వెంటేశ్వరరావు
- జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకారం



రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం

రాజానగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రైస్ మిల్లర్లంతా సంఘటితంగా ఐకమత్యంతో మెలగాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాజానగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. జిల్లాల విభజన అనంతరం తలెత్తిన ఇబ్బందులను చక్కబెట్టి ఒక తాటిపైకి తేవడానికి కృషి చేస్తున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకుని రైస్‌మిల్లు యజమానులు బేషజాలకు పోకుండా ఐకమత్యంగా ఉండాలన్నారు. మరో ముఖ్యఅతిథి రాష్ట్ర కార్యదర్శి వల్లూరి సూర్యప్రకాశరావు(సూరిబాబు) మాట్లాడుతూ రైస్‌మిల్లు రంగం పలు సమస్యలతో సతమతమవుతోందని, వాటిని అధిగమించడానికి అందరం కలిసికట్టుగా పయనించాలని సూచించారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నామని, ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అనపర్తికి చెందిన అధ్యక్షుడిగా కర్రి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా యూబీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యక్షుడిగా బి.ఆంజనేయమూర్తి, సంయుక్త కార్యదర్శిగా కె.సుధాకర్, ట్రెజరర్‌గా ఎం.రామ్మూర్తిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాల అధ్యక్షులతో పాటు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పుష్కరాల రేవులో అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పుష్కరాల రేవు వెలుపల పేదలకు ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీనివాస్ ఆదివారం అన్నదానం చేశారు. ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్‌రావు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాలూరు శ్రీనివాసరావు, దేశినీడి రాంబాబు, పడాల యశోదకృష్ణ, లావణ్యలక్ష్మి, అప్పారావు, కుసుమ, వేద, పద్మ, కేతా ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఉండ్రాజవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి పేర్కొన్నారు. శనివారం రాత్రి ఉండ్రాజవరంలో నిర్వహించిన యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని గోపిమూర్తి చెప్పారు. అలాగే ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని కోరారు. అనంతరం 2025-26 సంవత్సరానికి యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గౌరవాధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్‌వీ కృష్ణప్రసాద్,మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కేవీఎల్ శిరీష, కోశాధికారిగా కె.విజయకుమార్‌లతోపాటు జిల్లా కౌన్సిలర్స్ ఈ సందర్భంగా ఎన్నికయ్యారు.

కెరీర్ గైడెన్స్‌పై హాస్టల్ విద్యార్థులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ సంక్షేమ హస్టళ్లలోని విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాలమేరకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, సత్‌ప్రవర్తన వంటి కీలక అంశాలపై ఆదివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వై.జంక్షన్‌లోని బీసీ బాలుర హాస్టల్లో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ పలు విషయాలపై మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడం, భవిష్యత్ లక్ష్యాల పట్ల స్పష్టత, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సహాయ బీసీ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు తెలిపారు.హెచ్‌డబ్ల్యువోలు అబ్దుల్ సుకూర్, వై.శ్రీనివాస్, కె.సుందరమ్మ, వైద్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన బిక్కవోలు



సుబ్రహ్మణ్య స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

బిక్కవోలు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుని షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బిక్కవోలు గ్రామం భక్తులతో పోటెత్తింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ప్రాచీన లక్ష్మీగణపతిని దర్శించుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ అన్నప్రసాదాన్ని అందించారు. ఇళ్లపల్లిలోని 108 స్తంభాల గుడిలోని పాదరస లింగాన్ని, బలభద్రపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు దర్శించుకున్నారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వక్త

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీ నాగేశ్వరరావు పార్కులోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో ఆదివారం గురజాడ అప్పారావు వర్ధంతి జరిగింది. ముఖ్య వక్తగా విచ్చేసిన సామాజిక కార్యకర్త గౌరవ్ మాట్లాడుతూ గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకాన్ని, అందులోని సారాంశాన్ని క్రోడీకరించి వివరించారు. పిల్లి పట్టాభిరామారావు, కందుల చలపతిరావు ఆధ్వర్యంలో 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, గోరుంతల వరప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ, కాసాని శంకరరావు, బండి నరేంద్ర, జామిశెట్టి అప్పాజీ, ఎం.త్రినాథరావు, ఎం.పార్వతి,శెట్టి నాగమణి, ఎం.భారతి, వజీరుద్దీన్, బి.బుల్లబ్బాయి, కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్ సేవక్ సుబ్బారావు సేవలు అభినందనీయం



సుబ్బారావును సత్కరిస్తున్న ఏఎస్పీ

రాజానగరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో డాక్ సేవక్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన చిక్కాల సుబ్బారావు సేవలు అభినందనీయమని తపాలా శాఖ ఏఎస్పీ శ్యాంప్రసాద్ కొనియాడారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎస్‌వోలో డాక్ సేవక్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన సుబ్బారావు సత్కార సభ చక్రద్వారబంధంలోని కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. దీనికి శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కొండబాబు, జీఎస్ఎస్ ప్రసాద్, భూలోకం, బీవీ రమణ, ఎస్‌పీఎం మంగాదేవి, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

అప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకాశరావు ఎన్నిక



అప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న నేతలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (అప్టా) రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాశరావు ఎన్నికయ్యారు. మచిలీపట్నం సన్‌స్టార్ స్కూల్లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాకి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా ఎంజీ మెహది ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎస్‌జీఎస్ గణపతిరావు పదవీ విరమణతో ఖాళీ అయిన ఈ పోస్టును ఎన్నిక ద్వారా భర్తీ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన కాకి ప్రకాశరావును, కృష్ణా జిల్లాకు చెందిన ఎంజీ మెహదిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ప్రకాశరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసే ఎస్జీటీలకు శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్న ప్రైమరీ తరగతులను విడదీయవద్దని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణరావు, తెలంగాణా రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ శర్మ, అప్టా రాష్ట్ర ఎన్నికల అధికారి రాజాసాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల సంఘ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, తక్షణమే వాటిని పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్ర మహాసభల నేపథ్యంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించినట్టు తెలిపారు. అధ్యక్షుడిగా ఎస్ఎండీ రఫీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కె.భానుప్రసాద్, సహాయ కార్యదర్శిగా బి.సిద్ధు, కోశాధికారిగా కె.సోమశేఖర్‌తోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి



సింగంపల్లిలో ధర్నా చేస్తున్న సీపీ రెడ్డినగర్ వాసులు

రంగంపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లిలో సీపీ రెడ్డి నగర్ వాసులకు ఇళ్ల పట్టాల మంజూరు కోసం సోమవారం నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు.ఆదివారం ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీరెడ్డి నగర్‌లోని పేదలు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సదరు కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక సార్లు ప్రజాప్రతినిధులు వాగ్దానాలు చేసి తర్వాత పట్టించుకోలేదని విమర్శించారు.కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, సభ్యుడు వీరబాబు, ఏఐఎఫ్ టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె అంజిబాబు,చెక్క సత్తిబాబు, సీతారాం, దంగేటి రత్నం, సూర్యారావు, లక్ష్మీ, తలుపులమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించిన జడ్జి అనురాధ



గొల్లగూడెంలో ఆశ్రమాన్ని పరిశీలిస్తున్న జడ్జి అనురాధ

దేవరపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లగూడెంలో లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధుల ఆశ్రమాలను కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ ఆదివారం సాయంత్రం సందర్శించి వృద్ధులను, దివ్యాంగులను సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఆశ్రమానికి కావల్సిన సౌకర్యాలను తెలుసుకున్నారు. ఆశ్రమానికి ఎటు వంటి అవసరం ఉన్నా కొవ్వూరు కోర్టు తరపున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వృద్ధుల ఆశ్రమాన్ని, దివ్యాంగుల ఆశ్రమంలోని రూములను, వంట సామాన్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఆశ్రమం చైర్మన్ కాగిత భాస్కరరావు, గోపాలపురం ఎస్ఐ మనోహర్, న్యాయవాదులు ఎండీవీ ప్రసాద్, ఎం.వెంకటేశ్, బ్రహ్మయ్య, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించేది వ్యాపారస్తులే'



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘ నాయకుడు

రంగంపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపేనా చెల్లించేది వ్యాపారస్తులేనని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ముందుగా పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీవాసవి మాతకు పూజ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు.అనంతరం మండలాధ్యక్షుడిగా మండవిల్లి రాజా, ఉపాధ్యక్షుడిగా మండ రామకృష్ణ, కార్యదర్శిగా బొండా సత్తిబాబు, ఉప కార్యదర్శిగా కుసుమంచి రాజేష్,కోశాధికారిగా గల్లా శ్రీనివాసరావు, ఉప కోశాధికారులుగా గ్రంధి రాజా,సీహెచ్ గోవిందు, కార్యవర్గ సభ్యులుగా మరో 18 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకుని, ప్రమాణస్వీకారం చేయించారు.మండలంలోని ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సోమవారం పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ నెలలో మొత్తం 2,34,520 మందికి రూ.102.704 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు.

దిత్వా గాలు!



చివరకిలా : గొల్లప్రోలులో టార్పాలిన్లు కప్పి ఉంచిన ధాన్యపు రాశులు



మళ్లీ కష్టమే : దేవరపల్లిలో ధాన్యం బరకాలు

భయపెడుతోన్న మరో తుఫాన్

- తీవ్ర ఆందోళనలో రైతాంగం
- 50 శాతమే ఒబ్బిడి అయిన పంట
- కళ్లాల్లో ధాన్యం.. రైతు కళ్లల్లో దైన్యం
- పంట కాపాడుకునేందుకు పరుగులు

పాపం అన్నదాత.. పండించే వరకే పంట అన్నదాత చేతుల్లో ఉంటుంది.. పండించిన తరువాత ప్రకృతి చేతుల్లో ఉంటుంది.. ప్రకృతి కరుణిస్తే పంట చేతికొస్తోంది.. లేదంటే ప్రకృతిలో కలిసిపోతోంది.. ఆరుగాలం కష్టించిన అన్నదాతను నష్టాల పాలు చేస్తోంది.. మొన్న మొంథా తుఫాన్ కష్టం నుంచి అన్నదాత తేరుకోలేదు.. ఇంకనూ పడుతూ లేస్తూ ఉన్నాడు..చివరికి ఏదో ఒక విధంగా బయటపడదామనుకుంటుంటే మళ్లీ దిత్వా తుఫాన్ వచ్చిపడింది.. ఎటు నుంచి ఏ కష్టం వస్తుందోనని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.. ఉన్న పంటను కాపాడుకునే పనిలో పడ్డాడు.. పంటను విక్రయించేసిన వాళ్లు హమ్మయ్య అని ఊపిరిపీల్చుకుంటుంటే కళ్లాలపై ఉన్న వాళ్లు మాత్రం ఏం జరుగుతుందోననే దిగాలులో ఉన్నారు.. ఆదివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో మరో ప్రమాదం నుంచి బయటపడేందుకు సన్నద్ధమవుతున్నారు. మరో వైపు సముద్రంలోనూ ఈదురుగాలులు వీస్తున్నాయి.. దీంతో ప్రజల్లో అలజడి నెలకొంది..



ధాన్యం ఎత్తేయండి : గోపాలపురంలో ఇలా

(పిఠాపురం/గొల్లప్రోలు/పి.గన్నవరం/ రాజమహేంద్రవరం/సామర్లకోట -ఆంధ్రజ్యోతి)

పంట చేతికందే వేళ వరుస తుఫాన్ హెచ్చరికలు, మారుతున్న వాతావరణం రైతులను కలవరానికి గురిచేస్తోంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, మబ్బులతో కూడిన వాతావరణం, సాయంత్రం చిరుజల్లులతో రైతులు తమ ధాన్యాన్ని మిల్లులు చేర్చే వరకు భయంభయంగా ఆకాశం వైపు చూస్తూ కాలం గడిపారు. ధాన్యం తడవకుండా చూసుకునేందుకు రైతులు పాట్లు పడ్డారు. ధాన్యం లోడుతో ఉన్న వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరాయి.

పెరిగిన చలి తీవ్రత

తుఫాన్ ప్రభావమో ఏమిటో కానీ ఆదివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి.. భానుడు మబ్బుల మాటున దాక్కునే ఉన్నాయి. ఉదయం నుంచి జనం తట్టుకోలేనంతగా చలి తీవ్రత ఉంది. రాత్రయినా వాతావరణంలో మార్పుకానరాలేదు. పెద్దలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి మంకీ క్యాప్‌లు, స్వెటర్లు వేసుకుని తిరిగారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మారిన వాతావరణం

బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావం తో ఆదివారం వాతావరణం మారిపోయింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచాయి. పగటిపూటే చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 శాతానికి పైగా విస్తీర్ణంలో వరి కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. మిగిలిన పంట పొలాల్లోనే ఉంది. కోతలు, నూర్పుళ్లు వేగంగా జరుగుతున్న తరుణంలో దిత్వా తుఫాన్ హెచ్చరికతో ఆదివారం రైతులు వ్యవసాయ పనులు నిలిపివేశారు. ధాన్యం తడవకుండా పరుగులు పెట్టారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఆరబోసిన ధాన్యం రాశులను ఒబ్బిడి చేసుకుని బరకాలు,టార్పాలిన్లు కప్పారు. వరి కుప్పల్లోకి నీరు చేరకుండా బరకాలు కప్పారు. మరో వైపు మిల్లుల వద్ద ఉన్న లారీలు, ట్రాక్టర్లల్లో ధాన్యం బస్తాలు తడవకుండా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకో వైపు గాలుల ప్రభావంతో వరి పంట నేలవాలింది.రెండు, మూడు రోజుల్లో కోత కోయాల్సిన పంట నేలనంటడంతో గింజ రాలే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిల్లర్ల మాయాబజార్..

వరి కోత యంత్రాలతో కోసిన ధాన్యంలో ఎక్కువ శాతాన్ని మిల్లర్లు కొనుగోలు చేస్తారు. దళారులు, వ్యాపారుల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. తేమ శాతం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. ఇప్పుడు తుఫాన్‌తో వాతావరణం మారడంతో ఇదే అదనుగా ధాన్యాన్ని తక్కువ కొనేందుకు ప్రయత్నిస్తున్నారు.రెండు రోజుల వ్యవధిలో ధాన్యం బస్తాను రూ.75 నుంచి రూ.125 వరకూ తక్కువకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన ధరకు అమ్మకుంటే ధాన్యం వర్షానికి తడిస్తే నష్టం మరింత అధికంగా ఉంటుందని భావించి వారు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు.

మొంథా మరువక ముందే...

ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వరిచేలు నేలనంటాయి. దిగుబడి గణనీయంగా తగ్గి నష్టం వాటిల్లింది. ప్రస్తుత తుఫాన్ ప్రభావం మాసూలు చేసుకుంటున్న రైతులపై పడింది. ఎక్కువశాతం రైతులు యాంత్రీకరణ ద్వారానే తమ పంటను ఒబ్బిడి చేసుకుంటున్నప్పటికీ వాతావరణం కరుణించకపోతే యంత్రాలు తిరిగే పరిస్థితి ఉండదు. ఒబ్బిడి చేసుకున్న ధాన్యం కనీసం ఒక్కరోజైనా ఎండబెట్టకపోతే తేమశాతం మిల్లర్లు సూచించిన స్థాయికి రాదు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలు, మాసూళ్ల వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు వేచి చూడాలంటున్నారు. ధాన్యం రాశులు తడవకుండా, కుప్పల్లోకి నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



సముద్రంలో ఎగసి పడుతున్న కెరటాలు

తీరాన అలజడి

కొత్తపల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉప్పాడ తీరంలో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. సముద్రం నీటిమట్టం పెరగడంతోపాటు కెరటాలు ఉవ్వెత్తున ఎగసిప డుతూ ఉప్పాడ శివారు కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బీచ్ రోడ్డుకు రక్షణగా ఏర్పాటుచేసిన బండరాళ్లను తాకుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచీ తీరంలో ఈదురు గాలులు వీచడంతో సముద్రంలోకి వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు ఒడ్డుకు చేరుకొన్నారు.

తూర్పున ఇలా..

ధాన్యం ఇంకా పొలాల్లోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో సాగు చేయగా 62,712 హెక్టార్లలో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం కోతలు ఆపేశారు. కళ్లాల్లో సుమారు 30 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉండిపోయింది. 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యం కాగా ప్రభుత్వం 4 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ సేకరించింది.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా 1,67,406 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1,08,000 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఈస్ట్రన్ డెల్టాలో ముందుగా కోతలు మొదలైనప్పటికీ మొంథా తుఫాన్ ప్రభావంతో స్వర్ణ రకం ఎక్కువ శాతం నేలనంటడంతో పాటు కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.ఈస్ట్రన్ డెల్టాలో ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో, సెంట్రల్ డెల్టాలో 28 వేల ఎకరాల వరకు కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

కాకినాడలో ఇలా..

కాకినాడ జిల్లాలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఆలస్యంగా నాట్లు వేసిన తాళ్లరేవు, కరప, తొండంగి, తుని, రౌతులపూడి, శంఖవరం, కోట నందూరు, ఏలేశ్వరం మండలాల్లో మాత్రమే కోతలు ఇంకా మిగిలి ఉన్నాయి. 40 వేల మంది రైతుల సెల్‌ఫోన్లకు వాతావరణ సమాచారాన్ని అందించి జాగ్రత్తలను వివరించాం. డెల్టా ప్రాంత మండలాల్లో 75 శాతం పంటకోతలు పూర్తయ్యాయి. పంట కోతలను ప్రస్తుతానికి ఆపి వేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారులు ఆదేశించారు.

ఇక నుంచి రేషన్ దుకాణాల్లో టీ పొడి విక్రయాలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రేషన్ దుకాణాల్లో టీ పొడి విక్రయించనున్నారు. తొలుత కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో టీ పొడి విక్రయించాలని నిర్ణయించారు. 20 గ్రాముల ప్యాకెట్ రూ.10, 40 గ్రాముల ప్యాకెట్ రూ.20కు అమ్మకాలు చేసే విధంగా ధరలు నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లాలో 472 రేషన్ దుకాణాల్లో తొలుత టీ పొడిని విక్రయించనున్నారు. రేషన్ డీలర్లకు బియ్యం, పంచదార విక్రయిస్తే వచ్చే కమీషన్‌తో పాటు ఇక నుంచి టీ పొడి అమ్మకాల ద్వారా కూడా 14 శాతం మార్జిన్ వస్తోంది. టీ పొడి విక్రయించే రేషన్ డీలర్లు రూ.5వేలు చొప్పున డీడీలు తీయాలని అధికారులు సూచించారు.అయితే రేషన్ డీలర్లు మాత్రం తమ ఆర్థిక పరిస్థితి బాగోలేదని టీ పొడిని అరువుపై ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులను కోరుతున్నారు.టీ పొడి విక్రయించిన తర్వాత సొమ్ములు ప్రభుత్వానికి జమ చేస్తామంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రేషన్ దుకాణాలను మినీ మాల్స్‌గా తయారు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రేషన్‌కార్డుదారులు సూపర్ మార్కెట్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్నీ ఇక్కడే లభించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

5 నుంచి నన్నయలో అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 5,6 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆయోకీం పబ్లిష్‌కో సంయుక్త ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు పరిశోధనా పత్రాలను 2వ తేదీ లోపు సమర్పించవచ్చన్నారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలు, వ్యవసాయ ఆహార సాంకేతికత, ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వంలో వాటి ఉపయోగాలు అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. దేశ విదేశాల నుంచి శాస్త్ర సాంకేతిక రంగంలో నిష్ణాతులు వక్తలుగా హాజరవుతారన్నారు. వివరాలకు సదస్సు కన్వీనర్ బి.జగన్మోహన్‌రెడ్డి 93471 53270 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

గురజాడకు ఘన నివాళి



గురజాడ చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ,రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషను వ్యవహారిక భాషగా చేసేందుకు భాషోద్యమం చేసిన గురజాడ అప్పారావు చిరస్మరణీయుడని కేంద్ర ఉక్కు,భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ అన్నారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ గురజాడ రచించిన దేశమంటే మట్టికాదోయ్ అన్న పద్యాన్ని పాడి మన మనసులను పులకరింపజేశారన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి కల్యాణం



కోరుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. 560 మంది దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు.ఆలయ ప్రధాన అర్చకుడు కాళ్ళకూరి బాల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో శైవ ఆగమ పండితులు స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.



కామన్వెల్త్ విజేతగా విద్యార్థిని జూహిత గుణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ లాలాచెరువు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జూహిత గుణ ఈటానగర్‌లో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ మేరకు హెచ్‌ఎం యు.విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో 69 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని జూహిత గుణ సాధించిందని తెలిపారు. నవంబరు 26 నుంచి ప్రారంభమైన పోటీలు డిసెంబరు ఒకటో తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్ ఈటానగర్‌లో జరుగుతున్నాయన్నారు. తమ పాఠశాల విద్యార్థి జూహిత స్వర్ణపతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. అర్బన్ డిఐ దిలీప్ కుమార్, ఆనందనగర్ స్కూల్ హెచ్‌ఎం అంకం మల్లేశ్వరరావు ,ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బీజేపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షుల నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఐదు అనుబంధ విభాగాలకు జిల్లా అధ్యక్షులను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా పాలడుగుల శ్రీవిద్య, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పేపకాయల కాశీ, బీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మరుకుర్తి నరేష్‌కుమార్ యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తగరం సురేష్‌బాబు, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్ జైన్‌లను నియమించారు.

చెరువులు వదలరు!



ఖాళీగా కనిపిస్తే కబ్జా

- ఆక్రమించేస్తున్న రియల్టర్లు
- చెరువులు.. కాలువ గట్లు మాయం
- యథేచ్ఛగా సాగుతున్న విక్రయాలు
- మామూళ్ల మత్తులో అధికారులు
- మోసపోతున్న కొనుగోలుదారులు
- జిల్లా కేంద్రంలోనూ మోసాలు

రాజమహేంద్రవరం రూరల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) :ఎక్కడికక్కడ చెరువులు మాయమైపోతున్నాయి..ఖాళీగా కనిపిస్తే కబ్జా అయిపోతున్నాయి.. రాత్రి రాత్రే స్థలాలుగా మారి పోతున్నాయి. ఇక్కడ గతంలో చెరువు ఉండేదిగా ఏమైపోయిందనే మీ మాంసలో ప్రజలు మునిగితేలుతున్నారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన నీటి పారుదల, పంచాయతీ రాజ్, రెవెన్యూ శాఖల అధికారులదే. అన్నీ తెలి సిన అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో మునిగి తేలుతూ అయినా కాడికి జేబులో వేసుకుని కళ్లు మూసుకుంటున్నారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలా లను అప్పనంగా ధారాదత్తం చేస్తున్నారు. దాతల ఆశయా లను నీరుగారుస్తున్నారు. చెరువు గర్భంలో గాని, చెరువు గట్లను అనుకొని గాని ఎటువంటి కట్టడాలు నిర్మాణాలు చేయకూడదన్నది నిబంధన. ఇక్కడ ఏకంగా చెరువులు,కాలువ గట్లు కబ్జా చేసి లే అవుట్లు వేస్తున్నారు..నిర్మాణాలు చేస్తున్నారు.

సామాన్యులు బలి

రూపాయి, రూపాయి పోగేసుకొని చౌకగా వస్తుందని కష్టపడి కొనుక్కొంటున్న మధ్య తరగతి ప్రజలు, చిరుద్యోగులు రియల్టర్ల మాటలు నమ్మి మోస పోతున్నారు. కోలమూరు పంచాయతీ పరిధిలోని మర్ల చెరువుకు అనుకొని 316/1)లో వేసిన లేఅవుట్‌లో చిరు ప్రభుత్వ ఉద్యోగి సుమారు 125 గజాలు స్థలం కొనుగోలు చేసుకున్నాడు. ఇంటి నిర్మాణానికి లోనుకు వెళ్లగా బ్యాంకు అధికారులు ఎన్‌వోసీ తీసుకురమ్మని చెప్పడంతో రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయ అధికారులను సంప్రదించాడు. అప్పుడు తేలింది అసలు విషయం తాను కొనుక్కొన్న స్థలంలో సుమారు సుమారు 40 గజాలు మర్ల చెరువు (సర్వే నెంబరు 313)కి సంబంధించిందని..ఇవి ఉదాహరణలు మాత్రమే ఇలా చెప్పుకుంటూ పోతే చాలానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘటనలు బోలెడు.. అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

అందుగలదు.. ఇందులేదని..

రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు, వెంకటనగరం, కొంతమూరు, కోలమూరు, రాయుడుపాకలు, గాడాల, ధవళేశ్వరం, రాజానగరం, కొవ్వూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో చెరువులు, ఇరిగేషన్ స్థలాలను కబ్జా చేసి మరీ లేఅవుట్లు వేసి విక్రయాలు చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారుల మామూళ్ల మత్తులో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. చెరువుగట్లు, పంట కాలువలు ఉన్న ప్రాంతాల్లో లేఅవుట్ వేయాలంటే ఇరిగేషన్ , రెవెన్యూ శాఖల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ తీసుకోవాలి. అయితే అక్రమార్కులకు అటువంటి ధ్రువీకరణలు లేకుండానే ఓకే చెప్పేస్తున్నారు. కొంతమంది ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండడంతో వారికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. పంచాయతీ అధికారులు, రుడా అధికారులు కళ్లు మూ సుకుని వాటికి సంబంధించి ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేస్తున్నారు.

అనుమతులు ఎలా ఇచ్చారో..

రాజమ హేంద్ర వరం రూరల్ మండలం వెంకటనగరం పం చాయతీ పరిధిలో గల కాతేరు గ్రామాన్ని ఆనుకుని ఉన్న లేఅవుట్ లో సుమారు 28 అడుగుల మేర చెరువు గట్టు కలిపి రోడ్డుగా చూపించారు. అదే విషయాన్ని రెవెన్యూ అధికా రులు నిర్ధారించారు.ఈ లేఅవుట్‌కి సంబంధించి ఇరిగేషన్ అధికారులు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదని ఇరిగేషన్ ఏఈ చెబుతున్నారు.రుడా అధికా రులు అనుమతులు ఇచ్చారంటూ అమ్మకాలు సాగిస్తు న్నారు. పంచాయతీ అధికారులు ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చేస్తున్నారు.





మృతుడు ఆనంద్(ఫైల్), సంఘటనా స్థలంలో లభించిన కత్తి

మాటువేసి..చంపేశాడు

- దోసకాయలపల్లిలో దారుణం
- బావను హత్య చేసిన బావమరిది
- ఇంట్లో నుంచి గెంటేశాడని కోపం

కోరుకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉండే గ్రామంలో దారుణహత్య కలకలం రేపింది. హత్య విషయం తెలిసి అంతా ఉలిక్కిపడ్డారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. కోరుకొండ మండలం దోసకాయపల్లి గ్రామానికి చెందిన పిల్లి ఆనంద్ (27) మాంసం వ్యాపారం చేసుకుంటూ భార్య త్రివేణితో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో త్రివేణి పెద్దమ్మ కొడుకు సీతానగరం మండలం ములకల్లంక గ్రామానికి చెందిన గాది రాజ్‌కుమార్ సహాయకుడిగా ఉంటూ వాళ్లింట్లోనే ఉండేవాడు. ఆ సమయంలో ఆనంద్ భార్య త్రివేణి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అతన్ని మందలించి ఇంటి నుంచి పంపించివేశారు. ఇదిలా ఉండగా రాజ్‌కుమార్ త్రివేణికి ఫోన్‌చేసి అసభ్యంగా మాట్లాడడం, ఆమె భర్తను చంపుతానని బెదిరించి ఫోన్ పెట్టేసేవాడు. ఏదో రోజు నీ భర్తను చంపుతానని త్రివేణిని బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం ఆనంద్ రైతు సేవా కేంద్రం వెనక వైపు మేకలు కోసేందుకు వెళ్లాడు.అయితే అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న గాది రాజ్‌కుమార్ కత్తితో నరికి చంపి కత్తి అక్కడే పడేసి బైక్‌పై పరారైనట్టు పోలీసుల తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యకిషోర్, ఎస్ఐ నాగార్జున తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ ఘటనతో దోసకాయపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. హత్యకు గురైన ఆనంద్‌కు భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.భర్త మృతదేహాన్ని పట్టుకుని ఇక మాకు దిక్కెవరంటూ భార్య రోదిస్తుంటే ఆపడం ఎవరి వల్లా కాలేదు. రాజ్‌కుమార్‌ను పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమవుతున్న భార్య త్రివేణి, బంధువులు

పూర్వ విద్యార్థుల కలయిక


1990-91లో పదోతరగతి చదివిన విద్యార్థులు

కొవ్వూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (గవర్నమెంట్ హైస్కూల్)లో 1990-91 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. దాదాపు 34 సంవత్సరాల తరువాత ఏకమయ్యారు. గోదావరి గట్టుపై గల సుబ్రహ్మణ్య స్నానఘట్టం వద్ద గల ఏపీ టూరిజం శ్రీరస్తు ఫంక్షన్‌హాలులో కార్యక్రమం జరిగింది. అప్పట్లో విద్య నేర్పిన గురువులను శాలువాలను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఈడ్పుగంటి సురేష్‌కుమార్, మద్దుకూరి సురేష్, అనపర్తి శివరామకష్ణ, ఉప్పులూరి కల్యాణ చక్రవర్తి, రామకృష్ణ, నాళం శ్రీను, మల్లుల రాంబాబు, కొల్లి రవికుమార్, కడియం వసంత్, బొడ్డు అప్పారావు, కలగర శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి


డీవీకే ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు

● ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ

తాళపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ అన్నారు. అన్నదేవరపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పీఎస్ హెచ్ఎంగా పని చేస్తున్న గెడ్డం డీవీకే ప్రసాద్ ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ పాఠశాలలో ఆయన చేసిన పలు అభివృద్ధి పనుల గురించి కొనియాడారు. అనంతరం ప్రసాద్ మాష్టారుని పూలమాలలో సత్కరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు జీ. రాజారత్నం, బారణాల శంకర్, కె. ప్రసన్న కుమార్, ఇ. సత్యనారాయణ, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గొల్లగూడెం దివ్యాంగుల ఆశ్రమం సందర్శన


వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేస్తున్న కొవ్వూరు అడిషనల్ జిల్లా జడ్జి అనురాధ

దేవరపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల, వృద్ధుల ఆశ్రమాలను కొవ్వూరు 9వ అడిషనల్ జిల్లా జడ్జి ఎం.అనురాధ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఆశ్రమానికి కావాల్సిన సౌకర్యాలు గురించి తెలుసుకుని మీకు ఎటువంటి అవసరం ఉన్నా ... మీ ఆశ్రమానికి కొవ్వూరు కోర్టు తరఫున సహాయ సహకరాలు అందించటం జరుగుతుందని ఆమె తెలిపారు. వృద్ధుల ఆశ్రమాన్ని, దివ్యాంగుల ఆశ్రమంలోని రూములను, వంట సామాన్లు పరిశీలించారు. ఆశ్రమం చైర్మన్ కాగిత భాస్కరరావు వృద్ధాశ్రమానికి సహాయ సహకారాలు అందిస్తానన్న జడ్జికు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపాలపురం ఎస్సై మనోహర్, న్యాయవాదులు ఎండీవీ ప్రసాద్, ఎం.వెంకటేశ్, బ్రహ్మయ్య, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో 8 మందికి ఆర్థిక సాయం

ఉండ్రాజవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దమ్మెన్నులో మండల మానవత స్వచ్ఛంద సంస్థ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో ఎనిమిది మంది పేదలకు రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో భాగంగా సంస్థ సభ్యురాలు ఫణితిని పార్వతి మానవత శాంతిరథం నిర్మాణానికి తనవంతు సహాయంగా రూ.1.50 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ నాయకులు తాతిని వెంకట కృష్ణారావు, కఠారి సిద్ధార్థరాజు, స్థానిక పాఠశాల హెచ్ఎం వీ. భాస్కరరెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


పెనకనమెట్ట మడుగు వద్ద రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, తదితరులు

కొవ్వూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండుకళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. దొమ్మేరు నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల మీదుగా కుమారదేవం వెళ్లే రహదారికి పెనకనమెట్ట మడుగు వద్ద ఆదివారం నాబార్డు నిధులు రూ. 2.70 కోట్లతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడా బీటీ రోడ్డు గుంతలు పూడ్చకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రోడ్లన్నీ బాగుపడతాయని ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబు, పవన్, లోకేష్ రాష్ట్రంలో ఆర్థికఇబ్బందులను అధిగమించి సంక్షేమ పథకాలను అమలుచేస్తూ గత 12 సంవత్సరాల క్రితం పుష్కరాలకు వేసిన రోడ్డు గుంతలు కూడా పూడ్చలేదన్నారు. పెనకనమెట్ట నుంచి గురుకుల పాఠశాల మీదుగా కుమారదేవం వెళ్లే 3.67 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నాబార్డు నిధుల నుంచి రూ. 2.70 కోట్లు మంజూరు చేసిందన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రూ. 30 లక్షలతో బాలికల గురుకుల పాఠశాలలో సిమెంట్ రోడ్డు, వాటర్‌ప్లాంటు, గేమ్స్‌కు సంబంధించి పరికరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నియోజకవర్గంలో రోడ్లు,డ్రైనేజీల నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమం లో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సర్పంచ్ మేకల శ్రీను, సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, బేతిన నారాయణ, కేవీకే రంగారావు, తుం పల్లి ఆదినారాయణ, అచ్యుతరాయుడు, సుంకర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల్లో దిత్వా తుఫాన్ భయం

● పంటను కాపాడుకునేందుకు ఆపసోపాలు ● భారీ వర్షాలు కురిస్తే నష్టపోతామని ఆందోళన


దేవరపల్లిలో ధాన్యం కుప్పలకు బరకాలు కప్పిన దృశ్యం

దేవరపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం సాయంత్రం చినుకులు మొదలయ్యాయి. దీంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పండించిన ధాన్యంను కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. మండలంలో 9,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. అందులో ఇప్పటివరకు 70 శాతం వరికోతలు పూర్తి కాగా, మిగిలిన 30 శాతంలో 15 శాతం పొలాల్లో పంటగా ఉండగా, మిగిలిన 15 శాతం కల్లాల్లో ఉంది. వారంరోజుల్లో పంట చేతికి వస్తుందన్న తరుణంలో భారీ వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా కోసిన ధాన్యాన్ని జాతీయ రహదారిలోని సర్వీస్ రోడ్లలో ఆరబెట్టడానికి పోయగా, ఆదివారం వర్షం మొదలవడంతో బరకాలు కప్పారు. సోమ, మంగళ వారాల్లో కూడా వర్షాలు పడితే మొక్కలు మొలిచే అవకాశం ఉందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టాను

● ముళ్లపూడి సత్యనారాయణ, రైతు

నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. శనివారం కోత కోసి ధాన్యాన్ని ఆరబెట్టడం కూడా జరిగింది. కాగా, తుఫాన్ ప్రభావంతో చినుకులు పడటం వల్ల ధాన్యం కుప్పలుగా పోసి బరకాలు కప్పాను. ఒకవేళ వర్షం ఎక్కువైతే బరకం కింద నుంచి నీరు చేరి ధాన్యం రంగుమారే అవకాశం ఉంది.

గోపాలపురం: వరుస తుఫాన్ల కారణంగా ఈ ఏడాది గండం గచినట్టయ్యిందని భావించిన రైతాంగానికి దిత్వా తుఫాన్ మరోసారి ఆందోళనకు గురిచేస్తోంది. మండలంలో మొత్తం 11 వేల ఎకరాల్లో వరి సాగైంది. వాటిలో ఇప్పటి వరకు 50 శాతం పంట మాత్రమే కోత కోశారు. మిగతా 50 శాతం ఆయా దశల్లో ఉంది. ఏదిఏమైనా ఈ ఏడాది రైతులకు తుఫాన్లు మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారయ్యింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పుల కారణంగా ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. దీంతో ఒక మోస్తరు చినుకులు పడటంతో రైతులు రాశుల మీద ఉన్న ధాన్యానికి బరకాలు కప్పుకోవడం, సంచుల్లోకి ఎత్తి సురక్షిత ప్రాంతాలకు తరలించటం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ తుఫాన్ నుంచి గట్టెక్కించు దేవుడా అని కోరుకుంటున్నారు.

అలరించిన సంగీత విభావరి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక దానవాయిపేట శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద సంగీత లహరి కళావేదికలో ఆదివారం సాయంత్రం సంగీత విభావరి జరిగింది. సాంస్కృతిక సేవా సమితి ఆధ్వ ర్యంలో జరిగిన హెచ్.రామ్‌చరణ్, పి.జ్ఞానదేవ్, కె.యోగేష్, తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వెలసిన కోటసత్తెమ్మకు భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రా రంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, శాస్త్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం ఉచిత, ప్రత్యేక దర్శనాలు కల్పించారు. చిన్నాయిగూడెంకు చెందిన రాధేశ్యామ్ కల్యాణ భజన మండలిచే అమ్మవారి ఆలయంలో శ్రీరాములవారి కల్యా ణం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక దర్శనం ద్వారా రూ.30,780, అన్నదానం ద్వారా రూ.7182, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.20,735, పూజా టిక్కెట్ల ద్వారా రూ.54,558, మొత్తం రూ.1,13,255 ఆదాయం లభించినట్టు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

సీపీఎం నాయకుల నిరసన


నిడదవోలులో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గంజాయి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలతో యువతను చైతన్య పరుస్తున్న సీపీఎం కళాకారుడు పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం దారుణమని, వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నేత జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ పెంచలయ్యపై దాడికి దిగి కత్తులతో దారుణంగా వెంటాడి హత్య చేశారన్నారు. కార్యక్రమంలో జి.డానియేల్, పీ.ఫ్రాన్సిస్ రాజు, టీ. మహేష్, ప్రవీణ్, గండి రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా డిసెంబరు 1వ తేదీన జిల్లాలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా లెప్రసీ అండ్ టీబీ అధికారిణి డాక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. హెచ్ఐవీ పరీక్ష చేయించుకోండి-సమాచారం పొందండి-సురక్షితంగా ఉండండి అనే నినాదంతో ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వరకూ ర్యాలీ, అనంతరం కళాశాల సెమినార్ హాలులో అవగాహన సమావేశం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు నష్టం


నూతనంగా ఎన్నికైన బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యవర్గం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆంధ్ర, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రాంతీయ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఉదయకుమార్, అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిరావు, ఇతర నాయకులు మాట్లాడారు. అనంతరం నూతన ప్రాంతీయ నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. ప్రాంతీయ కార్యదర్శిగా యాళ్ల మురళీధర్, ఉప కార్యదర్శులుగా కిషోర్, స్వాతి, కోశాధికారిగా వెంకటేశ్వరరావు సహా పలువురిని ఎన్నుకున్నట్టు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి లక్ష్మీపతిరావు తెలిపారు.

పుష్కరాల రేవులో అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుష్కరాల రేవు వెలుపల పేదలకు ది ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీనివాస్ ఆదివారం అన్నదానం చేశారు. బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్‌రావు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించారు.

ఎల్ఐసీని అగ్రగామి సంస్థగా నిలుపుదాం

● ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్


సభలో మాట్లాడుతున్న ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

పాలకొల్లు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థను అన్నివిధాలుగా అగ్రగామిగా నిలపడం ఉద్యోగులుగా మనందరి బాధ్యత అని ఎస్‌సీజెడ్ఐఈఎఫ్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో రాజమండ్రి డివిజన్ 28వ మహాసభ డివిజన్ ఉపాధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఐఆర్‌డీఏఐ కొత్త ప్రతిపాదనల నేపథ్యంలో యూనియన్ సభ్యులుగా మన బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో మార్పులు, చేర్పులు పాలసీదారుల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. సంస్థను అభివృద్ధి చేస్తూ ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించుకోవాలని రవీంద్రనాథ్ సూచించారు. జీవిత బీమా ప్రీమియం ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్‌టి రద్దు మన సంఘం కృషితో జరిగిందన్నారు. ప్రత్యేక అతిథి రాజమండ్రి డివిజన్ ఎల్ఐసీ ఎస్‌డీఎం సత్యనారాయణ సాహు మాట్లాడుతూ ఉద్యోగులంతా సమైక్యంగా ఉండాలని సూచించారు. బ్రాంచ్ యూనియన్ నాయకులు మురళీకృష్ణ, ఆహ్వాన సంఘం కన్వీనర్ ఎన్‌వీఎస్. బాపిరాజు, ఎం. కోదండరామ్, తదితరులు మాట్లాడారు. డివిజన్‌లోని పలు బ్రాంచ్‌ల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు వర్ధంతి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏబీ నాగేశ్వరరావు పా ర్కులోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో ఆదివారం గురుజాడ అప్పారావు వర్ధంతి ఘనంగా జరిగింది. ముఖ్య వక్తగా విచ్చేసిన సామాజిక కార్యకర్త గౌరవ్ మాట్లాడుతూ గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకాన్ని, అందులోని సారాంశాన్ని క్రోడీకరించి వివరించారు. పిల్లి పట్టాభిరామారావు, కందుల చలపతిరావు ఆధ్వర్యంలో 50 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహంతి లక్ష్మణరావు, గోరుంతల వరప్రసాద్, మారిశెట్టి సత్యనారాయణ, కాసాని శంకరరావు, బండి నరేంద్ర, జామిశెట్టి అ ప్పాజీ, ఎం.త్రినాథరావు, ఎం.పార్వతి,శెట్టి నాగమణి, ఎం.భారతి, వజీరుద్దీన్, బి.బుల్లబ్బాయి, కె.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి జనసేన ఆపన్నహస్తం

● పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు


ముసుళ్లకుంటలో సరుకులు అందిస్తున్న జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు. తదితరులు

నల్లజర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కుటుంబాలకు జనసేన పార్టీ ఎప్పుడూ ఆపన్నహస్తం అందిస్తుందని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఆదివారం ముసుళ్లకుంటలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన కోట చిన్న సుబ్బారావు కుటుంబ సభ్యులకు మూడు బస్తాల బియ్యం, కూరగాయలు, ఆయిల్, కందిపప్పు, పంచదార అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియో జకవర్గ ప్రజలకు ఏ కష్టమొచ్చినా జనసేన నాయకులు, కార్యకర్తలు తమ సొంత ఖర్చులతో ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే సుబ్బారావు కుమారుల చదువు విషయంలో అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అచ్యుత సత్యనారాయణ, మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, ముసుళ్లకుంట పార్టీ అధ్యక్షుడు దగాని శ్రీనివాస్, మండల కార్యదర్శి కొత్తపల్లి హరిబాబు, చీపురుగూడెం అధ్యక్షుడు గుండాబత్తుల వరుణ్, దొండపాటి బాబు, రాచమల్ల నాగరాజు, తలంశెట్టి శ్రీనివాస్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి ● ఉండ్రాజవరంలో యూటీఎఫ్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

ఉండ్రాజవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బీ. గోపీమూర్తి పేర్కొన్నారు. శనివారం రాత్రి ఉండ్రాజవరంలో నిర్వహించిన యూటీఎఫ్ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరంగా ఉంచాలని కోరారు. అనంతరం 2025-26 సంవత్సరానికి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడిగా ఎస్. లక్ష్మీనారాయణ, అధ్యక్షుడిగా కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా సీహెచ్‌వీ కృష్ణప్రసాద్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా కేవీఎల్ శిరీష, కోశాధికారిగా కె. విజయకుమార్‌తోపాటు జిల్లా కౌన్సిలర్లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. జయకర్, ప్రధాన కార్యదర్శి ఏ. షరీఫ్, కోశాధికారి ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి. వెంకటరాముడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్నాయి...

●బొమ్మూరులోని తెలుగు విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● తరలివచ్చిన ఉపాధ్యాయులు.. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరు


సెల్ఫీలు తీసుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్న పూర్వ విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న వీసీ, ఎమ్మెల్యే వాసు



రాజమహేంద్రవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నంనాయుడు అధ్యక్షతన ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. విశ్వవిద్యాలయంలో తొలిసారి తొలి సమావేశంగా జరిగిన ఈ సమ్మేళానికి పూర్వ విద్యార్థులు అనేకమంది వచ్చారు. వారిలో ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. వారంతా క్లాస్ రూమ్స్‌కి వెళ్లి అలనాటి జ్ఞాపకాలు గుర్తు తెచ్చుకున్నారు. ముఖ్య అతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని, ఇక్కడకు విశ్వ విద్యాలయం రావడంతో తెలుగు భాషా అభిమానిగా తన పాత్ర కూడా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు కూడా ఈ విశ్వ విద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఇటువంటి సమ్మేళనాల వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని, ఇంత మంది ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేకత చెప్పడంతో మరింత ప్రాధాన్యత పెరిగిందన్నారు. వీసీ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయంలో ఉన్న శాఖలన్నీ దశలవారీగా ప్రవేశపెట్టి, వచ్చే ఏడాది నుంచి విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో జరిగేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టామని, కోర్సుల కోసం నోటిఫికేషన్ కూడా ఇచ్చామని, చాలా కోర్సులకు మంచి స్పందన ఉందని చెప్పారు. పూర్వ పీఠాధిపతి బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తరచు కలుసుకుంటూ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. వీసీ నాయుడికి విశ్వవిద్యాలయంపై పూర్తి అవ గాహన ఉందని, ఆయనకు అందరూ సహకరిస్తే బాగా అభివృద్ధి చేయగలరన్నారు. ప్రముఖులు రెంటాల వేంకటేశ్వర్లు, కూర్మయ్య పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై హాస్టల్ విద్యార్థులకు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు కలెక్టర్ ఆదేశాలమేరకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, సత్‌ప్రవర్తన వంటి కీలక అంశాలపై ఆదివారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వై.జంక్షన్‌లోని బీసీ బాలుర హాస్టల్లో కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ పలు విషయాలపై మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడం, భవిష్యత్ లక్ష్యాల పట్ల స్పష్టత, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని సహాయ బీసీ సంక్షేమాధికారి ముత్యాల సుబ్బారావు తెలిపారు. హెచ్‌డబ్ల్యు వోలు అబ్దుల్ సుకూర్, వై.శ్రీనివాస్, కె.సుందరమ్మ, వైద్యులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్ సేవక్ సుబ్బారావు సేవలు అభినందనీయం

● తపాలా శాఖ ఏఎస్పీ శ్యాంప్రసాద్

రాజానగరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో డాక్ సేవక్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన చిక్కాల సుబ్బారావు సేవలు అభినందనీయమని తపాలా శాఖ ఏఎస్పీ శ్యాంప్రసాద్ కొనియాడారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎస్‌వోలో డాక్ సేవక్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన సుబ్బారావు సత్కార సభ చక్రద్వారబంధంలోని కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. దీనికి శ్యాంప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కొండబాబు, జీఎస్ఎస్ ప్రసాద్, భూలోకం, బీవీ రమణ, ఎస్‌పీఎం మంగాదేవి, సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బావాజీపేటను ప్రత్యేక పంచాయతీ చేయాలి

● వెదురుపాక, బావాజీ పేట అఖిలపక్ష నాయకుల డిమాండ్ ● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వినతిపత్రం అందజేత

గోకవరం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక పంచాయతీ పరిధిలో ఉన్న బావాజీపేట గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని వెదురుపాక, బావాజీపేట అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి జిల్లా పంచాయతీ అధికారులతో మాట్లాడారు. ఈ విషయంపై అధికారుల నుంచి సానుకూల సమాధానం రావడంతో గ్రామసభ ఏర్పాటుచేసి తీర్మానం ఇస్తే తర్వాత ప్రక్రియను పూర్తి చేయవచ్చని ఎమ్మెల్యే చెప్పడంతో అఖిలపక్షం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పిల్లా చంటిబాబు, అఖిలపక్ష నాయకులు బత్తుల సారంగధరుడు, బొబ్బా రామకృష్ణ, కొత్తల వీరఅప్పారావు, గొర్రెల శ్రీను, కోరిపల్లి అప్పలస్వామి, గొంతెన అప్పల స్వామి, దాసరి నాగవిష్ణు, తదితరులు పాల్గొన్నారు.